నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, మంగళవారం 2 ఏప్రిల్ 2024 | VIKARABAD

- ధాన్యానికి క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇవ్వాల్సిందే..
- అన్నదాతల కోసం మరో ఉద్యమానికి తెరలేపిన బీఆర్ఎస్ పార్టీ..
- నేడు కలెక్టర్‌కు మెమోరాండం అందజేత.. 6న నియోజకవర్గ కేంద్రాల్లో దీక్షలు
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలతో కలిసి కదం తొక్కనున్న బీఆర్ఎస్
- ప్రభుత్వంపై నిరసన గళం విప్పేందుకు రైతాంగం సన్నద్ధం

రైతు కోసం.. గులాబీ జంగ్ సైరన్

'అన్ని పంటలకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది.. ఈ మేరకు యాసంగి ధాన్యానికి రూ.500 బోనస్ కచ్చితంగా ఇచ్చి తీరాల్సిందే.. లేదంటే వెంటాడుతాం.. ఈ విషయంలో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులంతా ప్రభుత్వాన్ని నిలదీయాలి' అని బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు రైతాంగానికి రంగారెడ్డి జిల్లా గులాబీ దళం వెన్నుదన్నుగా నిలిచేందుకు సన్నద్ధమవుతున్నది. డిమాండ్ల సాధనే లక్ష్యంగా మరో ఉద్యమానికి జిల్లా బీఆర్ఎస్ శ్రేణులు నడుం బిగించాయి.
-రంగారెడ్డి, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ)

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలను అందజేయనున్నారు. ఈనెల 6న ప్రతి మండల కేంద్రంలోనూ రైతులతో దీక్షలు నిర్వహించనున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు బీఆర్ఎస్ పార్టీ తల పెట్టిన కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. రైతు వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు చేపట్టిన ఈ కార్యక్రమాల్లో రైతాంగం సైతం పెద్దఎత్తున పాల్గొని నిరసన గళం విప్పేందుకు సమయత్తమవుతున్నది.

రైతు బతుకులు ఆగమాగం..

కాంగ్రెస్ వంద రోజుల పాలనలోనే వ్యవసాయ రంగం పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. జలాలు అడుగంటి కరువు తాండవిస్తున్నది. పంటలకు తడి అందక ఎండిపోయి పశువులకు మేతగా మారుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో తిప్పలు పడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో దిగుబడులు సైతం వచ్చే పరిస్థితి లేక రైతుల కష్టం అగ్గిపాలవుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరువు అనే మాట లేకపోగా.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కష్టాలు రైతులను వెక్కిరిస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో రైతు భరోసా, రుణ మాఫీ హామీలను ఇచ్చి రైతులను నమ్మించిన కాంగ్రెస్.. మాట నిలుపుకోకపోవడంతో రైతు కుటుంబాలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. చేతికొస్తున్న కొద్దిపాటి పంటలను సైతం అమ్ముకునేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు వ్యాపారులకు తక్కువ ధరకే అముకోవాల్సి వస్తున్నది. ఓ వైపు సాగు నీటి కష్టాలు, మరోవైపు కరెంటు కోతలతో పదేండ్లుగా మాయమైపోయిన రైతు కష్టాలు నేటి కాంగ్రెస్ పాలనలో మళ్లీ ప్రత్యక్షమవుతున్నాయి.

బోనస్ ఇచ్చేదాక కొట్లాడుడే..

రైతు ప్రయోజనాలే ముఖ్యంగా కేసీఆర్ ప్రభుత్వం పండిన ప్రతి గింజనూ కొని రైతులకు గిట్టుబాటు ధర కల్పించింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో మద్దతు ధర రైతులకు దక్కకుండా పోతున్నది. ఎండిపోగా.. పండిన కాస్తంత పంట కైనా బోనస్ ఇచ్చి ఆదుకోవాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇది ఎన్నికల నాటి హామీయే అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేకుండా పోయింది. కరువు పరిస్థితుల్లో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉంటే ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రైతుల కన్నా పార్లమెంటు ఎన్నికలే ముఖ్యం అన్నట్లుగా.. ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తుండడం రైతాంగానికి ఆగ్రహం తెప్పిస్తున్నది. ఈ పరిస్థితుల్లో గుండె చెదిరిన రైతన్నకు బాసటగా నిలవాలని సంకల్పించిన కేసీఆర్ స్వయంగా తానే రంగంలోకి దిగారు. రైతాంగం కోసం పోరుబాట పట్టారు. కరువు పరిస్థితులు నెలకొని ఎండిపోతున్న పంటలతో అరిగోస పడుతున్న రైతాంగానికి భరోసా కల్పించేందుకు ఇప్పటికే సూర్యాపేట, జనగామ జిల్లాల్లో పాలం బాట పట్టారు. ఇదే క్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించుకుని ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా కేసీఆర్ పిలుపు మేరకు.. రంగారెడ్డి జిల్లాలో మంగళవారం నిర్వహించే కలెక్టర్‌కు వినతి పత్రాల సమర్పణతోపాటు 6న నిర్వహించే దీక్షలను విజయవంతం చేసేలా పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగొచ్చి బోనస్ ఇచ్చే వరకు నిరసన కార్యక్రమాలను బీఆర్ఎస్ పార్టీ కొనసాగించనున్నది.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా..

-కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్, చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి

చేవెళ్ల ఎంపీగా తనకు ఒకసారి అవకాశం కల్పిస్తే ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీనేతనైన నాకు పోటీ చేసే అవకాశం కల్పించారు. గతంలో రంగారెడ్డి జిల్లా జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఎంతో సేవ చేశా. అప్పట్లో గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు అందించా. ఈ నెల 13వ తేదీన కేసీఆర్ చేవెళ్ల నుంచి ఎన్నికల శంఖారావం పూరించబోతున్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలందరూ కారు గుర్తుకు ఓటు వేసి నన్ను భారీ మెజార్టీతో గెలిపించాలి.

చేవెళ్లలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధిచెబుదాం

తెలంగాణ ప్రజలు బాగుండాలని నిరంతరం ఆలోచించే ఏకైక వ్యక్తి కేసీఆర్

బీఆర్ఎస్ ఎంపీగా కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం

ముఖ్యమంత్రి హోదా మరిచి మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డికి గుణపాఠం చెప్పాలి

బీజేపీ 'పాలమూరు-రంగారెడ్డి'కి జాతీయ హోదా ఎందుకివ్వలేదు?

పార్టీ కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి

చేవెళ్ల కేజీఆర్ గార్డెన్‌లో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన మీటింగ్

హాజరైన అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

షాబాద్, ఏప్రిల్ 1: తెలంగాణ అంటేనే కేసీఆర్ అని.. కేసీఆర్ నిశానా చెరిపేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని, అది సాధ్యమయ్యేది కాదని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేసి కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలన్నారు. సోమవారం చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృతస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆమెతోపాటు బీఆర్ఎస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్తా, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాసాని జ్ఞానేశ్వర్ జిల్లా పరిషత్తు చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా జిల్లాకే కాకుండా కమ్యూనిటీకి కూడా సేవలు చేస్తూ 96 కులాలను ఏకతాటిపైకి తీసుకొచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అంత మంచి వ్యక్తిని ఎన్నికల బరిలో నిలిపిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలు బాగుండాలని నిరంతరం ఆలోచించే ఏకైక వ్యక్తి కేసీఆర్ అని చెప్పారు. కేసీఆర్ ఏం చేశారని అనేవారు ఒక్కసారి ఆలోచించాలన్నారు. స్వరాష్ట్రానికి ముందు 7గంటలు వచ్చే కరెంట్‌ను 24గంటలకు పెంచింది కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. రైతులు అప్పులపాలు కాకూడదనే ఉద్దేశంతో రైతుబంధు తీసుకొచ్చి ఏటా నగదు సాయం అందించారన్నారు. ఇంట్లో నీళ్లు తాగేటప్పుడే అందులో కేసీఆర్ కనిపిస్తారన్నారు. జిల్లాల కలెక్టరేట్‌లు, రైతు వేదికలు నిర్మించారన్నారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని సూచించారు. సీఎం రిలీఫ్ ఫండ్ అంటే ఒక భరోసా ఉండేదని, మూడు నెలల నుంచి సీఎం రిలీఫ్ ఫండ్ ఇవ్వడం లేదన్నారు. దీంతో రాష్ట్రంలో పాలన ఏ విధంగా సాగుతుందో ప్రజలు ఆలోచించాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎవరెళ్లిపోయినా పార్టీకి ఒరిగేదేమీలేదన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదా మరిచి మాట్లాడుతున్నారన్నారు. పాలమూరు-రంగారెడ్డి పూర్తి చేసి రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ కొంత భాగానికి సాగునీళ్లు ఇవ్వగలిగితే నా జన్మ ధన్యమవుతుందని, కేసీఆర్ చెప్పినట్లు ఆమె గుర్తు చేశారు. షాబాద్ మండలంలోని చందనవెల్లిలో కంపెనీలు రావడంతో ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన్నట్లు తెలిపారు. టెక్నికల్‌గా సమస్య లేకుండా 111జీవో తీసేసి విధంగా కొత్త జీవో తీసుకువచ్చిన దమ్మున్న నాయకుడు కేసీఆర్ అని చెప్పారు.

చేవెళ్లలోని సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

రూ.15లక్షలు ఇచ్చినంకనే బీజేపీకి ఓటేస్తామని చెప్పాలి..

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణకు ఏం చేసిందో చెప్పగలరా అని మాజీ మంత్రి సబితారెడ్డి ప్రశ్నించారు. మోదీని చూసి ఓటు వేయమని ప్రజలను కోరుతున్న బీజేపీ నాయకులు.. మోదీ తెలంగాణకు చేసిన మేలేంటో చెప్పాలన్నారు. దేవుడి పేరు, మతం పేరు చెప్పుకుని పబ్బం గడుపుకోవడమే బీజేపీ వాళ్ల పని అన్నారు. నిజంగానే తెలంగాణపై బీజేపీకి అంతా ప్రేమ ఉంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకివ్వలేదని ప్రశ్నించారు. వెయ్యి రూపాయల నోటు రద్దు చేసినప్పుడు నల్లధనం తీసుకువచ్చి ఒక్కొక్క రైతు అకౌంట్లో రూ.15లక్షల చొప్పున వేస్తామని మోదీ చెప్పారని, అవి వేసినంకనే బీజేపీకి ఓటు వేస్తామని ప్రజలు చెప్పాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఇవన్నీ ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఈ నెల 13వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేవెళ్లకు వస్తున్నారని, ఆ రోజు మనమందరం తరలివెళ్లి మేమంతా మీ వెంట ఉన్నామని నిరూపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, జడ్పీటీసీలు పట్నం అవినాశ్‌రెడ్డి, కాలె జయమ్మ, గోవిందమ్మ, కాలె శ్రీకాంత్, ఎంపీపీలు గోవర్ధన్‌రెడ్డి, కాలె భవాని, వేతనాల మండలి మాజీ చైర్మన్ నారాయణ, మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్లు మిట్ట వెంకటరంగారెడ్డి, గూడూరు నర్సింగ్‌రావు, డాక్టర్ ప్రశాంత్‌గౌడ్, పాపారావు, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, బీఆర్ఎస్ పార్టీ మండలాల అధ్యక్షులు ప్రభాకర్, నర్సింగ్‌రావు, గోపాల్, నాగిరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి, పోలీస్ రాంరెడ్డి, చిట్టెం మల్లారెడ్డి, శేరిగూడెం వెంకటయ్య, జడల రాజేందర్‌గౌడ్, కొలన్ ప్రభాకర్‌రెడ్డి, బర్కల రాంరెడ్డి, రామగౌడ్, శేరి శివారెడ్డి, మంగలి యాదగిరి, కుమ్మరి దర్శన్, యా మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణాలకన్నా పల్లెలే బెటర్..

ఆస్తి పన్ను వసూలులో వెనుకబడిన మున్సిపాలిటీలు

బకాయిలు రాబట్టడంలో అధికారులు విఫలం

తాండూరు మున్సిపాలిటీలో కేవలం 44 శాతమే..

కొడంగల్‌లో 74.. పరిగిలో 79 శాతం వసూలు

గ్రామపంచాయతీల్లో 94 శాతం ఆస్తి పన్ను రాక..

వికారాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లలో మున్సిపాలిటీలు వెనుకబడ్డాయి. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే జిల్లాలోని మున్సిపాలిటీల్లో చాలా తక్కువ మొత్తంలో ఆస్తి పన్ను వసూలైంది. ముఖ్యంగా తాండూరు మున్సిపాలిటీలో నిర్దేశించిన లక్ష్యంలో కేవలం 44 శాతం పన్ను బకాయిలు వసూలైంది. సంబంధిత మున్సిపాలిటీ అధికారులు పన్ను బకాయిలు రాబట్టడంపై తగిన దృష్టి పెట్టకపోవడంతోనే ఇంత తక్కువలో వసూలైనట్లు తెలుస్తున్నది. ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ తదితర కార్యక్రమాలతో మున్సిపాలిటీల్లో ఆస్తి పన్ను వసూళ్లలో వెనుకబడినట్లు అధికారులు చెబుతున్నారు. తాండూరు మున్సిపాలిటీలో రూ.9.72 కోట్ల ఆస్తి పన్ను రావాల్సి ఉండగా.. కేవలం రూ.4.30 కోట్లు రాబట్టారు. అదేవిధంగా వికారాబాద్ మున్సిపాలిటీలో రూ.3.67 కోట్లకు.. రూ.3.34 కోట్లు (91 శాతం), పరిగిలో రూ.2.17 కోట్లకుగాను రూ.1.71 కోట్లు(79.02 శాతం), కొడంగల్ మున్సిపాలిటీలో 1.49 కోట్లకు.. రూ.1.11 కోట్లు వసూలు చేశారు.

గ్రామ పంచాయతీల్లో 94 శాతం..

జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో భారీగా ఆస్తి పన్ను వసూలైంది. గ్రామ పంచాయతీలన్నీ కలిపి రూ.9.57 కోట్ల పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా.. రూ.9.02 కోట్ల(94.22 శాతం) పన్నును రాబట్టారు. గత ఐదారేండ్లుగా జీపీల్లో ఆస్తి పన్ను లక్ష్యానికి అనుగుణంగా వసూలవుతున్నది. ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేకంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించడం కూడా ఆస్తి పన్ను వసూళ్లు పెరగడానికి కారణంగా చెప్పవచ్చు. జీపీల్లో వచ్చిన రూ.9.02 కోట్లలో పన్నుల రూపంలో రూ.8.43 కోట్లురాగా, నాన్ ట్యాక్స్ రూపంలో రూ.59.11 లక్షలు వచ్చింది. వికారాబాద్ మండలంలో వందశాతం పన్ను వసూలు కాగా, మిగతా మండలాల్లో 90 శాతానికిపైగా పన్ను వసూలైంది.

మండలాల వారీగా ఆస్తి పన్ను ఇలా..

మండలం	వసూలైన పన్ను (రూ.లక్షల్లో)
బంట్వారం	రూ.18.33
బషీరాబాద్	రూ.36.30
బొంరాస్‌పేట	రూ.30.68
ధారూరు	రూ.43.46
దోమ	రూ.47.46
దౌల్తాబాద్	రూ.32.80
కొడంగల్	రూ.33.27
కోట్‌పల్లి	రూ.26.38
కులకచర్ల	రూ.66.45
మర్పల్లి	రూ.68.47
మోమిన్‌పేట	రూ.80.13
నవాబుపేట	రూ.53.97
పరిగి	రూ.56.51
పెద్దేముల్	రూ.42.93
పూడూరు	రూ.80.50
తాండూరు	రూ.1కోటి
వికారాబాద్	రూ.31.74
యాలాల	రూ.53.43

రేపు వికారాబాద్‌కు రామన్న రాక

వికారాబాద్, ఏప్రిల్ 1 : వికారాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం ఈ నెల 3న వికారాబాద్ పట్టణంలోని గౌలికర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సోమవారం తెలిపారు. ముఖ్యఅతిథులుగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు సబితారెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఇతర ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు హాజరవుతారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఏ ఒక్క గ్యారెంటీ సక్రమంగా అమలు చేయడం లేదు

-కాలె యాదయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే

వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని మాయమాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క గ్యారెంటీ కూడా సక్రమంగా అమలు చేయడం లేదు. కేసీఆర్ తెచ్చిన మిషన్ భగీరథ నీళ్లనూ ప్రజలకు సరిగ్గా అందించే పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం లేదు. తెలంగాణ వచ్చినంక కొండా వెంకటరంగారెడ్డి మనుమడు, ఈ జిల్లాకు వారసుడని కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని తీసుకువచ్చి ఎంపీగా చేస్తే, ఆయన ఇక్కడి ప్రజలకు ఏం చేయలేదు. మరోవ్యక్తి రంజిత్‌రెడ్డి మొన్నటి దాకా బీఆర్ఎస్ పార్టీలో ఉండి, ఇప్పుడు కాంగ్రెస్‌లోకి ఎందుకు పోయారో అర్థం కావడం లేదు. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాకు జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఎన్నో సేవలు చేసిన కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. ఈ నెల 13న చేవెళ్లలో నిర్వహించే కేసీఆర్ బహిరంగ సభకు కార్యకర్తలంతా తరలివచ్చేందుకు సిద్ధం కావాలి.

పోయినోళ్లు తాలు గింజలలాంటోళ్లు..

-మెతుకు ఆనంద్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే

పార్టీలో పదవులు అనుభవించి, పార్టీని వదిలిపోయే వాళ్లంతా మధ్యలో వచ్చి మధ్యలోనే వెళ్లిపోతున్నారు. అలాంటి వారి గురించి మనం ఆలోచించాల్సిన అవసరం లేదు. వారంతా వడ్లు తూర్పార పడితే కొట్టుకుపోయే తాలు గింజలు. మనం గట్టి వడ్లలాంటి వాళ్లం ఎప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉంటాం. విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలు రాకముందే బీఆర్ఎస్ పార్టీ ఉన్నది, వాళ్లు పోయినంక పార్టీకి ఎలాంటి నష్టం లేదు. ఎన్నికల తర్వాత పార్టీని ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉన్నది. పార్టీని వదిలిపోయిన వారిని ఎట్టి పరిస్థితుల్లో మళ్లీ పార్టీలోకి తీసుకోవద్దు. బీసీ నాయకుడు కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం.

సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలి..

-దయానంద్‌గుప్తా, ఎమ్మెల్సీ

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ అందించిన పథకాలను ప్రజలకు వివరించాలి. అన్ని వర్గాల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాలు అమలు చేసింది. ఉమ్మడి రంగారెడ్డిజిల్లాకు చెందిన బీసీ నేత, సీనియర్ నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలి. పేదలకు అందించిన పథకాలపై ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయాలి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఇబ్బందులు పెడుతున్న విషయాలను ప్రజలకు వివరించాలి. జ్ఞానేశ్వర్ గెలుపు కోసం అందరూ కలిసికట్టుగా పని చేయాలి.

గొప్ప వ్యక్తి కాసానిని గెలిపించుకుందాం..

-సురభి వాణీదేవి, ఎమ్మెల్సీ

96 కులాలను కలుపుకొని వ్యవస్థను నడిపించిన కాసాని జ్ఞానేశ్వర్ గొప్ప వ్యక్తి. కార్యకర్తలే ఏ పార్టీకైనా వెన్నెముక. కార్యకర్తలందరూ కలిసికట్టుగా పనిచేసి బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలి. అధికారపక్ష నేతలు మాట్లాడే మాటలన్నీ నీటిమీద రాతలలాంటివి. పదేండ్లలో కరెంట్, తాగునీరు, విద్య, వైద్యం తదితర విషయాల్లో తెలంగాణ దేశానికే దిక్సూచిగా నిలిచింది. రాష్ట్రపతి భవన్‌లో తన తండ్రి పీవీకి భారతరత్న ఇవ్వడం సంతోషంగా ఉన్నది.